
సాక్షి
పల్నాడు
గురువారం । 17 । ఏప్రిల్ । 2025



గుణదలకు క్రైస్తవుల పాదయాత్ర

దుగ్గిరాల: ఆర్‌సీఎం మత పెద్దలు, దీక్ష తీసుకున్న క్రైస్తవులు బుధవారం గుణదల మేరీమాత పుణ్యక్షేత్రానికి డాక్టర్ సురేష్ యామర్తి ఆధ్వర్యాన పాదయాత్ర చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 515.00 అడుగుల వద్ద ఉంది. ఇది 140.3150 టీఎంసీలకు సమానం.

సంకటహర చతుర్థి పూజలు



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వరుడి ఉపాలయంలో బుధవారం సంకట హర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకుడు శేషసాయిశర్మ ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం కూడా చేశారు.

న్యూస్‌రీల్

నిషేధిత పత్తి విత్తనాల విక్రయం నేరం




సత్తెనపల్లి: నిషేధిత పత్తి విత్తనాలు విక్రయించటం నేరమని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ఏడీఏ ఆర్. శ్రీధర్ రెడ్డి అన్నారు. గుంటూరులోని వ్యవసాయ శాఖ డైరెక్టర్, కమిషనర్ ఆదేశాల మేరకు ఆ కార్యాలయం నుంచి వచ్చిన ఏడీఏ పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పలు విత్తన దుకాణాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌టీఈ విత్తనాల నిల్వలు, అమ్మకాలకు రాష్ట్రంలో అనుమతి లేదన్నారు. వాటిని విక్రయించటం చట్టరీత్యా నేరమన్నారు. తనిఖీలలో డీలర్ల దగ్గర ఆ విత్తనాలు లభించలేదన్నారు. రైతులకు తప్పనిసరిగా విత్తన కొనుగోలు రసీదు ఇవ్వాలన్నారు. సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ విత్తన డీలర్లు గుర్తింపు పొందిన డిస్ట్రిబ్యూటర్ నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల నుంచి విత్తనాలు తీసుకోవాలన్నారు. మధ్యవర్తుల వద్ద కొనుగోలు చేయరాదన్నారు. మధ్యవర్తుల సమాచారం ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు. తనిఖీలలో వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ మండల వ్యవసాయ అధికారి వీఎస్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జైలులో జిల్లా జడ్జి పరిశీలన



రేపల్లె రూరల్: రేపల్లె సబ్ జైల్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సయ్యద్ జియావుద్దీన్ బుధవారం సందర్శించారు. జైలు పరిసరాలను, ఖైదీల గదులను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడారు. నేరం ఆరోపించబడి ప్రైవేటు న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారి కోసం ప్రభుత్వం ఉచిత న్యాయ సేవలు అందించేందుకు ప్రభుత్వ న్యాయవాదిని ఏర్పాటు చేసిందన్నారు. అవసరమైన వారు ప్రభుత్వ న్యాయవాది సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది గుమ్మడి కుమార్‌బాబు, సబ్ జైల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



పిడుగురాళ్ల : పట్టణంలోని శ్రీ రామ తీర్థ సేవాశ్రమం బజార్‌లోని శ్రీ మేధా దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఇటీవల ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. బుధవారం గాయత్రి పీఠం ప్రధాన అర్చకులు విష్ణువర్ధన్ శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మేధా దక్షిణామూర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. అనంతరం కందుల శ్రీనివాసరావు తండ్రి జ్ఞాపకార్థం రూ. 17 లక్షలను ఆలయ పునర్నిర్మాణానికి అందించారు. వేలమంది భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పట్నంబజారు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బందితో పలు ప్రాంతాల్లో ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. సంగడిగుంట, పొన్నూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ తీగల వల్ల జరిగే అగ్ని ప్రమాదాలపై మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ప్రచార వాల్‌పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేశారు. గుంటూరు–2 ఫైర్ స్టేషన్ అధికారి పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు మిర్చి యార్డు ఎదుట ర్యాలీ చేస్తున్న రైతులు

గిట్టుబాటు కోసం పోరుబాట

చిలకలూరిపేట: బర్లీ పొగాకు రైతుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వెంటనే మద్దతు ధర కల్పించలాని పలు రైతు సంఘాలు, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. బర్లీ పొగాకు పండించిన రైతులకు గత ఏడాది మాదిరిగా ధర చెల్లించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... పొగాకు రైతులకు న్యాయమైన మద్దతు ధర లభించేలా చూడాలన్నారు. దీంతో ఎగుమతులను ప్రోత్సహించడం కూడా పొగాకు బోర్డు ప్రాథమిక కర్తవ్యమని తెలిపారు. కానీ వర్జీనియా పొగాకును మాత్రమే పట్టించుకుంటోందని మండిపడ్డారు. బర్లీ పొగాకు, నాటు పొగాకు తమ పరిధిలో లేవంటూ బాధ్యతల నుంచి తప్పుకొంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

పత్తాలేని ప్రైవేటు సంస్థలు

గతేడాది పొగాకుకు ఏర్పడిన డిమాండ్‌తో ఈ ఏడాది సీజన్ మొదట్లో పలు కంపెనీలు రైతులను ప్రోత్సహించడంతో ఎక్కువమంది బర్లీ పొగాకు సాగు చేశారని వెల్లడించారు. ఎకరాకు రూ.లక్షన్నరకుపైగా ఖర్చు చేసి రైతులు, అదనంగా మరో రూ.40 వేలు కౌలు వెచ్చించి మరికొందరు సాగు చేశారన్నారు. పంట చేతికొచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. విత్తనాలు ఇచ్చిన ప్రైవేట్ కంపెనీలు పత్తాలేకుండా పోవడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. దళారులు మద్దతు ధరను పదేపదే మార్చకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బర్లీ పొగాకును టుబాకో బోర్డు పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పర్చూరు పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు బర్లీ పొగాకు రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదన్నారు. అనంతరం తహసీల్దార్ మొహమ్మద్ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు, నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహన రావు, సీఐటీయూ పల్నాడు జిల్లా కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎం.రాధాకృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి పేలూరి రామారావు, జన క్రాంతి పార్టీ నాయకులు షేక్ గౌస్, వీసీకే నాయకులు వంజా ముత్తయ్య, నేతలు బి.శ్రీనునాయక్, నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో ధర్నా నిర్వహిస్తున్న వివిధ సంఘాలు, పార్టీల నాయకులు

హత్యాచారం కేసును నీరుగార్చిన పోలీసులు

- బాధిత కుటుంబానికి న్యాయం చేయండి
- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు డిమాండ్
- ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ



మాట్లాడుతున్న బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ: మహిళలకు రక్షణ కల్పిస్తామని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు వినుకొండ రూరల్ మండలం ఏనుగుపాలెంలో చింతలదేవి అనే వివాహిత హత్యాచారం కేసులో నిజాలు నిగ్గు తేల్చాలని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనితలకు బహిరంగ లేఖ రాశారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లేఖను మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా బొల్లా మాట్లాడుతూ... వివాహితపై హత్యాచారం కేసును పోలీసులు అనుమానాస్పద మృతి కేసుగా సెక్షను పెట్టి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. ఇటీవల పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికలో హత్యగా భావిస్తున్నట్లు వెల్లడి కావడం గమనార్హమన్నారు. జిల్లా ఎస్పీ, పోలీసు ఉన్నతాధికారులకు దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కూడా దీనిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వాస్తవాలు మాట్లాడే వారిపై కేసులు పెట్టి నోరు నొక్కడం తప్ప ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. న్యాయం కోసం వివాహిత భర్త పోలీసుల వద్దకు వెళ్తే ఆయనపైనే హత్య కేసు పెడతామని బెదిరిస్తున్నట్లు ఆరోపించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పార్టీ తరఫున పోరాటం చేస్తామని, అండగా ఉంటామని పేర్కొన్నారు.

ఉల్లాస్ రెండో విడత లక్ష్యం 30 వేల మంది

- తొలి దశలో 10,164 మందికి లబ్ధి
- జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: గతేడాది అందరికీ అక్షరాస్యత (ఉల్లాస్) కార్యక్రమం మొదటి విడత ద్వారా జిల్లాలో చదవడం, రాయడం రాని 10,707 మందిని అక్షరాస్యులను చేశామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు వెల్లడించారు. 2025–26లో 30 వేల మందిని విధాన, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యులను తయారు చేయాలని అధికారులకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఉల్లాస్ పథకంపై జిల్లాస్థాయి కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. మొదటి ఫేజ్‌లో కేవలం గ్రామీణ ప్రాంతాల్లో వయోజన విద్య కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. రెండో దశలో పట్టణ ప్రాంతాల్లోని వారికీ తరగతులు నిర్వహించాలని సూచించారు. ఆ మేరకు మున్సిపాలిటీల్లో ఉల్లాస్ సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. నిరక్షరాస్యులను గుర్తించి నమోదు చేయాలన్నారు. సెర్ప్, మెప్మా అధికారులు ప్రతి పది మంది అభ్యాసకులకు ఒక విద్యా వలంటీర్ చొప్పున నియామకాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ రాయడం, చదవడం, ఆర్థిక లావాదేవీలు చేయగలిగేలా శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లా వయోజన విద్య అధికారి జగన్‌మోహన్‌రావు, డీఈవో ఎల్.చంద్రకళ, డీఆర్డీఏ పీడీ ఝాన్సీరాణి, గ్రామ–వార్డు సచివాలయాల నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మాచర్ల రూరల్: కేంద ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును రద్దు చేసి, దేశంలోని ముస్లింలకు రక్షణ కల్పించాలంటూ ముస్లిం సమైక్య వేదిక, ముస్లిం జేఏసీ నేతృత్వంలో బుధవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఒకే దేశం.. ఒకే చట్టం అంటూ ఎన్నికల్లో విస్తృత ప్రచారం చేసిన మోదీ, ఎన్నికల్లో గెలిచిన అనంతరం వక్ఫ్ బోర్డు సవరణ చట్టం పేరుతో ముస్లింలను ఇబ్బంది పెట్టే ప్రక్రియను మానుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు బిల్లు సవరణ ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ముస్లింల ఆస్తులపై భద్రత లేకుండా చేసే ప్రక్రియగా తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న ప్రతి పార్టీ పునరాలోచన చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా కూటమి నాయకులు సవరణ బిల్లు రద్దుకు చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు అబ్దుల్ రజాక్, ముక్తి సాహెబ్, అమీరా నజీర్, షేక్ జలీల్, కరిముల్లా, సుభాని, షేక్ జాని, ఖాజావలి, మస్తాన్, షేక్ సులేమాన్, కరిముల్లా, యాసిన్, ఇమాం, హుస్సేన్ పాల్గొన్నారు.

రోగికి వైద్యం అందించడంలో నిర్లక్ష్యం

- ప్రభుత్వ వైద్యశాలను సందర్శించిన పౌరహక్కుల సంఘ నాయకుడు
- రోగులకు సరైన వైద్యం అందట్లేదని ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి ఆరోపణ



ప్రభుత్వ వైద్యశాలలో ఓ మూలన పడుకొని ఉన్న గుర్తు తెలియని రోగి

నరసరావుపేట: కూటమి ప్రభుత్వంలో పేదలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షలా మారింది. కలెక్టరేట్ సమీపంలోని 200 పడకల ప్రభుత్వ వైద్యశాలలో సరైన వసతులు లేక రోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హాస్పిటల్‌లో కొన్ని రోజులు క్రితం గుర్తుతెలియని వ్యక్తిని చికిత్స కోసం చేర్చగా, ఆ వ్యక్తికి చికిత్స అందజేయకుండా ఒక మూలన పడేశారని పౌర హక్కుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి శిక్కినం చిన్న పేర్కొన్నారు. విషయం తెలుసుకొని తాను హాస్పిటల్‌కు వెళ్లానని చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలలో 30 మంది నర్సులకుగాను కేవలం పదిమంది ఉండటం వలన రోగులకు సరైన వైద్యం అందించలేని పరిస్థితి నెలకొందన్నారు. సుమారు 150 మందికిపైగా ఇన్‌పేషెంట్లు ఉంటే వారందరికీ పది మందితో ఏవిధంగా సేవలు అందజేస్తామని వైద్యులు తనతో చెప్పారని పేర్కొన్నారు. ఈ విషయంపై సూపరింటెండెంట్‌ను కలిసేందుకు ప్రయత్నించగా ఆయన అంగీకరించలేదన్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని కోరారు. ప్రభుత్వ వైద్యశాలలో సరైన వసతులు కల్పించాలని, బాధితులను మెరుగైన వైద్యం అందించాలని చిన్న డిమాండ్ చేశారు.

రోగి మానసిక పరిస్థితి సరిగా లేదు

దీనిపై హాస్పిటల్ సూపరింటెండెంట్ సురేష్‌కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ఆ రోగి మానసిక పరిస్థితి సరిగా లేదన్నారు. వైద్యానికి సహకరించట్లేదని పేర్కొన్నారు. తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని అన్నారు. తాను బుధవారం హాస్పిటల్‌లో సదరన్ క్యాంపులో ఉన్నానని, అనంతరం సూపరింటెండెంట్ కార్యాలయంలో ఉన్నానని చెప్పారు. తనను ఎవరూ కలవలేదని పేర్కొన్నారు.

కేరళకు తరలిస్తున్న గోవులు పట్టివేత

మంగళగిరి: నగర పరిధిలోని కాజ టోల్‌గేట్ వద్ద 30 గోవులను పట్టుకున్నారు. శ్రీకాకుళం నుంచి కేరళకు గోవులను తరలిస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం వీహెచ్‌పీ నేతలు టోల్‌గేట్ వద్ద కాపలా ఉన్నారు. ఇంతలో 30 గోవులను తరలిస్తున్న కంటైనర్ రావడంతో డ్రైవర్ అన్సారీని పట్టుకుని మంగళగిరి రూరల్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు గోవులను గో ఆశ్రమానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రధాని సభకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైద్యారోగ్య శాఖ కమిషనర్ వీర పాండియన్, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ

గుంటూరు వెస్ట్: మే 2వ తేదీన అమరావతిలోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఎస్పీ సతీష్ కుమార్, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా లతో కలిసి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నోడల్ అధికారులకు విధులు కేటాయించిందన్నారు. జిల్లా అధికారులకు కూడా వారు నిర్వహించాల్సిన విధులపై సూచనలు జారీ చేశామన్నారు. ప్రధాని పర్యటనను అధికారులు ప్రతిష్ఠగా భావించి విజయవంతం చేయాలన్నారు. ప్రధాన సభలో పాల్గొనే ముందు ప్రధాని రోడ్‌షో ఉంటుందని వాటి ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రాంగణమంతా శానిటేషన్ చక్కగా ఉండాలని చెప్పారు. ప్రాంగణమంతా సుందరీకరణ చేయాలన్నారు. అవసరమైన సిబ్బందిని ఆయా శాఖలు నియమించుకోవాలన్నారు. సభా ప్రాంతంలో సీటింగ్ ఏర్పాటుతో పాటు మంచినీరు, స్నాక్స్ ఏర్పాటు చేయాలన్నారు.

రూట్‌మ్యాప్‌పై అవగాహన ఉండాలి..

కార్యక్రమానికి సంబంధించి రూట్ మ్యాప్‌పై అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమం ప్రారంభం నుంచి ముగింపు వరకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి లోపాలు ఉండకూడదని తెలిపారు. వాహనాల పార్కింగ్‌కు 5 ప్రాంతాలు గుర్తించామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోనే వాహనాలు పార్క్ చేసే విధంగా చూడాలని తెలిపారు. బ్యారికేడ్లు, మొబైల్ టాయ్‌లెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాని కార్యక్రమానికి భారీ స్థాయిలో ప్రజలు హాజరవుతారని, వారు సురక్షితంగా ఇంటికి చేరే వరకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వివరించారు. అడిషన్ ఎస్పీ సుప్రజ, డీఆర్ఓ ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.గంగరాజు, జడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పర్యటన ఏర్పాట్లు పరిశీలన..

వెలగపూడి(తాడికొండ): మే 2వ తేదీన తుళ్ళూరు మండలం వెలగపూడి సచివాలయం సమీపంలో వివిధ శంకుస్థాపన కార్యక్రమాల్లో ప్రధాని మోదీ పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లను బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, ఆయుష్ కమిషనర్ దినేష్ కుమార్, పలువురు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్, సభా ప్రాంగణం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు, వీవీఐపీలు ప్రయాణించే మార్గాలకు సంబంధించిన ప్రాంతాలను పరిశీలించి చేపట్టాల్సిన చర్యలపై సూచనలు జారీ చేశారు. సీఆర్డీఏ అదనపు కమిషనర్లు నవీన్, ప్రవీణ్ చంద్, ఆర్‌డీఓ శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, సీఆర్డీఏ, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పెట్రోలు ట్యాంకర్ బోల్తా

- త్రుటిలో తప్పిన ప్రమాదం.. డ్రైవర్‌కు గాయాలు
- చేబ్రోలు మండలం నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ వద్ద ఘటన



చేబ్రోలు మండలం నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ వద్ద బోల్తా పడిన పెట్రోలు ట్యాంకర్

చేబ్రోలు: సడన్‌గా బ్రేక్ వేయడంతో పెట్రోలు ట్యాంకర్ లారీ బోల్తా పడిన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొండపల్లి నుంచి చీరాలకు పెట్రోలుతో వెళ్తున్న హెచ్‌పీ కంపెనీ లారీ చేబ్రోలు మండలం నారాకోడూరు జడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. దగ్గరకు వచ్చేవరకు స్పీడ్ బ్రేకర్ కనిపించక, డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఘటన జరిగింది. ఈ సంఘటనలో విజయవాడకు చెందిన పెట్రోలు ట్యాంకర్ డ్రైవర్ కె.వీరాస్వామికి గాయాలవటంతో 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా ప్రాంతానికి ట్రైనీ ఐపీఎస్ దీక్ష, తెనాలి డీఎస్పీ జనార్ధన్, పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, ఎస్ఐ డి.వెంకటకృష్ణ, తహసీల్దార్ కె.శ్రీనివాసశర్మ, అగ్నిమాపక సిబ్బంది చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

బెంబేలెత్తిన స్థానికులు, వాహనదారులు

సుమారు ఎనిమిదివేల లీటర్ల పెట్రోలు ఉన్న ట్యాంకర్ లారీ బోల్తా పడటంతో పాటు కొంత లీకేజీ అవుతుండటంతో స్థానికులు, రాకపోకలు సాగించే వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవటంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది పెట్రోలు ట్యాంకర్ లారీ చుట్టూ నురగ (ఫోమ్)ను స్ప్రే చేసి ప్రమాదం జరగకుండా తగిన జాగ్రత్తలు చేపట్టారు. పొన్నూరు, గుంటూరు రోడ్డులో వాహన రాకపోకలను పోలీసులు నిలుపదల చేశారు. ట్రాఫిక్‌ను ఇతర ప్రాంతాల ద్వారా మళ్లించారు.

ట్రాఫిక్ జామ్‌తో తీవ్ర ఇబ్బందులు

నారాకోడూరు జడ్పీ హైస్కూల్ ఎదురు జీబీసీ రహదారిపై పెట్రోలు ట్యాంకర్ బోల్తా పడటంతో పొన్నూరు, గుంటూరు రోడ్డులో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంటూరు నుంచి వచ్చే వాహనాలను నారాకోడూరు వద్ద, పొన్నూరు వైపు నుంచి వచ్చే వాహనాలను చేబ్రోలు వద్ద ట్రాఫిక్ మళ్లించారు. దీంతో సింగిల్ రోడ్డు కావటంతో వాహనాలు ఎదురు ఎదురుగా వచ్చి పలు చోట్ల వాహనాలు గంటల కొద్దీ నిలిచిపోయాయి.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితులు అరెస్టు

నరసరావుపేట రూరల్: పమిడిమర్రు గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్య కేసులో నిందితులైన జి.శివనాగరాజు, ఎం.పార్వతిలను డీఎస్పీ కె.నాగేశ్వరరావు అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసులు బుధవారం సాయంత్రం వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన మురికిపూడి సిపోరా అనే వివాహిత ఎలుకల మందు తిని చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. దీనిపై పూనూరి అశోక్ చేసిన ఫిర్యాదు మేరకు యల్లమంద బైపాస్‌రోడ్డులో నిందితులు ఇద్దరిని అరెస్టు చేశారు. న్యాయమూర్తి ముందు హాజరుపర్చగా, వారికి రిమాండ్ విధించినట్లు పోలీసులు వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు



పిడుగురాళ్ల: ఆత్మహత్య చేసుకోబోతున్నానని చెప్పిన వ్యక్తిని పిడుగురాళ్ల పట్టణ పోలీసులు కాపాడిన సంఘటన తుమ్మలచెరువు రైల్వే గేటు సమీపంలో చోటు చేసుకుంది. తుమ్మలచెరువు గ్రామానికి చెందిన వనవర్తి ప్రసాద్ కుటుంబ కలహాల నేపథ్యంలో 15వ తేదీ రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి దాటాక ఆత్మహత్య చేసుకుంటున్నానని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు వెంటనే 100 ఫోన్ చేసి సమాచారం అందించటంతో ఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శ్రీరాం వెంకట్రావు ఆదేశాల మేరకు ఎస్ఐ మోహన్ స్పందించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ప్రసాద్ ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. వెంటనే ప్రసాద్‌ను కాపాడి కుటుంబసభ్యులకు అప్పగించారు.



మంచికల్లు గ్రామంలో పెనుగాలులకు నేలకూలిన అరటి తోట



పాలువాయి గ్రామంలో తడిసిన ధాన్యం బస్తాలు



పాలువాయి గ్రామంలో తడిసిన మిర్చి పంట

అకాల వర్షంతో రైతన్నకు వెతలు

- తడిసిన ధాన్యం, మిర్చి పంటలు.. నేలకూలిన అరటి
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వినతి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి, పెనుగాలులకు ధాన్యం, మిర్చి పంటలు తడవడంతోపాటు అరటి పంట నేలకూలడంతో అన్నదాతల ఆశలు ఆవిరి అయ్యాయి. రెంటచింతల, పాలువాయి, మంచికల్లు, మల్లవరం, గోలి, మిట్టగుడిపాడు తదితర గ్రామాలలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. భారీగా పెనుగాలులు వీచాయి. కల్లాల్లో ఉన్న ధాన్యం, మిర్చి పంటలను తడవకుండా కాపాడుకోవడానికి రైతులు పట్టలు తీసుకుని ఉరుకులుపరుగులు పెట్టారు. రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంటలు తమ కళ్ల ముందే తడవడంతో రైతన్నలకు దిక్కుతోచడం లేదు. తాను సాగు చేస్తున్న 6 ఎకరాల అరటి చెట్లు మొత్తం నేలకూలడంతో సుమారు రూ.5లక్షల వరకు నష్టం వచ్చినట్లు మంచికల్లు గ్రామానికి చెందిన గొంగడి శ్రీనివాసరెడ్డి వాపోయారు. పాలువాయి గ్రామానికి చెందిన ములకా రోసిరెడ్డి, కుంచపు శ్రీనివాసరావు, గుంటా అంజిరెడ్డి, పెద్దిరెడ్డి శేషిరెడ్డి, మేకల వెంకటరెడ్డి, కౌంటిరెడ్డి గురవారెడ్డి, పెద్దిరెడ్డి వెంకటరెడ్డి తదితర రైతులకు చెందిన మిర్చి, ధాన్యం బస్తాలు ఈ అకాల వర్షానికి తడిసిపోయాయి. గాలి, వానతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందచేయాలని వారు కోరుతున్నారు.

పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా చూడాలి



వైద్యశాలలో తల్లులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవి

బెల్లంకొండ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు జరిగేలా వైద్య సిబ్బంది ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.రవి తెలిపారు. బుధవారం మండలంలోని చంద్రాజుపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల కొరకు వచ్చిన బాలింతలు, తల్లులతో ఆయన మాట్లాడారు. క్రమం తప్పకుండా సరైన సమయంలో టీకాలను వేయించాలని సూచించారు. అనంతరం జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధన, వాటి ప్రగతిపై సమీక్ష చేశారు. ఆన్‌లైన్ సర్వే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పీహెచ్‌సీలో ప్రసవాల ప్రగతి చాలా తక్కువగా ఉండడాన్ని గమనించారు. వైద్యశాలలో అన్ని రకాల పరికరాలు ఉన్నప్పటికీ, 24 గంటలు సేవలు అందిస్తున్నప్పటికీ ప్రసవాలు ఎందుకు చేయలేకపోతున్నారని వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యశాలలో ప్రసవాల ప్రగతి పెంపొందించాలని సూచించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి డా.నజీర్, సీహెచ్‌ఓ మణికుమారి, సూపర్‌వైజర్ బాషా, సిబ్బంది ఉన్నారు.

హత్యకేసులో నిందితుడు అరెస్టు



జాలయ్య అరెస్టు చూపుతున్న పోలీసులు

అమరావతి: మండల పరిధిలోని దిడుగు గ్రామంలో ఈ నెల 12వ తేదీన జరిగిన కానసాని కోటేశ్వరరావు హత్య కేసులో నిందితుడు గోళ్ల జాలయ్యను అమరావతి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ అచ్చియ్య చెప్పిన వివరాల ప్రకారం... కానసాని కోటేశ్వరరావు వద్ద తీసుకున్న అప్పు విషయమై తలెత్తిన వివాదంలో జాలయ్య బండరాయితో మోది ఈ హత్య చేశాడు. జాలయ్యను మండల పరిధిలోని ధరణికోట ఆరుడొంకల బావి సెంటర్‌లో బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం బుధవారం సాయంత్రం సత్తెనపల్లి కోర్టులో హాజరుపరిచారు.

బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు

మండల పరిధిలోని దిడుగు గ్రామంలో ఈ హత్య బెల్టు షాపులో జరగడం కలకలం రేపింది. బెల్ట్‌షాపు నిర్వాహకుడు ఎం.నాగేశ్వరరావుపై మంగళవారం కేసు నమోదు చేశారు. బెల్టు షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 45 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

నవధాన్యాల సాగుతో నేల తల్లిని బాగు చేద్దాం



మాట్లాడుతున్న నందకుమార్

నార్నెపాడు(ముప్పాళ్ళ): ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాలు సాగు చేసి నేల తల్లిని బాగు చేయవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి నందకుమార్ చెప్పారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నందకుమార్ మాట్లాడుతూ అంతర పంటలు వేయడం ద్వారా రైతుకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. భూమిలోని సూక్ష్మజీవుల అభివృద్ధి చెందుతాయని చెప్పారు. తద్వారా భూమి సారవంతం అవుతుందన్నారు. సత్తెనపల్లి డివిజన్ మాస్టర్ ట్రైనర్ కంచర్ల మధుబాబు మాట్లాడుతూ పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) సాగు చేయడం వల్ల భూమిలోని సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు అందుతాయని తెలిపారు. కొంత కలుపు ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. గ్రామంలోని మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకు వెళ్లేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వీఏఏ ప్రియాంక రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్, గ్రామపెద్దలు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్వాతి, పూజ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే యూజర్స్ కన్సల్‌టేటివ్ కమిటీ సభ్యుడిగా జూలకంటి



పిడుగురాళ్ల: దక్షిణ మధ్య రైల్వే జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్‌టేటివ్ కమిటీ మెంబర్‌గా పిడుగురాళ్లకు చెందిన పిడుగురాళ్ల రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలకంటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. బుధవారం రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌లోని ప్రధాన కార్యాలయం రైల్ నిలయం డీజీఎం(జీ), జెడ్ఆర్‌యూసీసీ కార్యదర్శి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఏఎన్‌యూలో నేడు వార్షిక దినోత్సవం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్ అండ్ లా, యూనివర్సిటీ సైన్స్ కళాశాల, యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలల యాన్యువల్ డే సెలబ్రేషన్స్ గురువారం జరుగుతాయని వేడుకల కన్వీనర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు, ఆచార్య సీహెచ్ లింగరాజు, డాక్టర్ డి.రవిశంకర్ రెడ్డి తెలిపారు. వేడుకలకు ముఖ్య అతిథిగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.కృష్ణతేజ, విశిష్ట అతిథిగా హైదరాబాద్ సీఎస్‌బీ అకాడమీ ప్రతినిధి ఎం.బాలలత, చీఫ్ ప్యాట్రన్‌గా వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ప్యాట్రన్స్‌గా రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్‌ఎస్ఎన్ రవికుమార్, గౌరవ అతిథులుగా ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, ఆచార్య కె.వీరయ్య, ఆచార్య ఎ.ప్రమీలారాణి హాజరవుతారన్నారు.

ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు..

యూనివర్సిటీ కళాశాలల యాన్యువల్ డే సెలబ్రేషన్స్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేడుకల ఏర్పాట్లకోసం ఆరు ప్రత్యేక కమిటీలను నియమించామన్నారు. యాన్యువల్ డే సెలబ్రేషన్స్ సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు వేడుకల్లో బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు.

కళా పురస్కారాలు ప్రదానం



తెనాలి: డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్ జాతీయస్థాయి చతుర్థ ఆహ్వాన నాటికల పోటీల్లో అయిదోరోజైన బుధవారం తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణానికి చెందిన సాంఘిక, పౌరాణిక పద్యనాటక కళాకారులు బద్దుల తిరుపతయ్య, దేవిశెట్టి కృష్ణారావు, చెన్నం సుబ్బారావును సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించి, కళాపురస్కారాన్ని ప్రదానం చేశారు. తొలుత గుంటూరుకు చెందిన ప్రముఖ కూచిపూడి నృత్యగురువు సరిత శిష్యబృందం, ఆరిశెట్టి ఐశ్వర్య శిష్యబృందం, యనమదల రీతిక, శవ్వా గ్రీష్మశ్రీలు కూచిపూడి, జానపద నృత్యాంశాలను ప్రదర్శించారు. తెనాలి కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, అధ్యక్షుడు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి పర్యవేక్షించారు. ఆరో రోజైన గురువారం సాయంత్రం కళాంజలి, హైదరాబాద్ వారి 'అన్నదాత', సహృదయం ద్రోణాదుల వారి 'వర్క్ ఫ్రమ్ హోం' నాటికల ప్రదర్శనలు వుంటాయని తెలియజేశారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా చాటడం అభినందనీయం



జాతీయ స్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన రోచిష్మతిని అభినందిస్తున్న కలెక్టర్

పెదకాకాని: వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటి జిల్లాకు మంచిపేరు తేవడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. పెదకాకాని మండలం ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న బిట్రా రోచిష్మతి ఈనెల 7వ తేదీ నుంచి 12 వరకు మణిపూర్‌లో జరిగిన 68వ జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంది. అండర్-17 విభాగంలో పాల్గొన్న రోచిష్మతి ఉత్తమ ప్రతిభ కనబరచి సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రోచిష్మతిని డీఈఓ రేణుక సమక్షంలో కలెక్టర్ నాగలక్ష్మి సత్కరించారు. జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయడమే కాకుండా రానున్న రోజుల్లో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి మంచిపేరు తేవాలని కలెక్టర్ ప్రోత్సహించారు. అదేవిధంగా పాఠశాల పీఈటీ చంద్ర వినయ్‌కుమార్‌ను అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల కరీముల్లా చౌదరి, గుంటూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాస్, జిల్లా సెక్రటరీ మెల్లెంపూడి రవి, నేషనల్ టీం కోచ్ నాగ శిరీష తదితరులు పాల్గొన్నారు.


యార్డుకు 1,59,032 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,59,032 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,57,640 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,800 నుంచి రూ.13,500 వరకు లభించింది. తాలు రకం మిర్చి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 76,896 బస్తాలు నిల్వ ఉన్నాయి.

పీఎఫ్ పనులపై వచ్చి ఉపాధ్యాయుడు మృతి

- గుంటూరులోని డీఈఓ కార్యాలయంలో కుప్పకూలిన ఉపాధ్యాయుడు చల్లా వెంకటరెడ్డి
- జూన్‌లో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా.. ఇంతలోనే మృత్యువాత



గుంటూరు ఎడ్యుకేషన్: బోధన వృత్తిలో సుదీర్ఘ సేవలందించిన ఉపాధ్యాయుడు హఠాన్మరణం చెందారు. పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న చల్లా వెంకటరెడ్డి (62) బుధవారం పీఎఫ్ క్లియరెన్స్, ఎన్ఓసీ కోసం గుంటూరు డీఈఓ కార్యాలయానికి వచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని విజిటర్స్ కుర్చీలో కూర్చుని ఉండగానే, తీవ్రమైన గుండెపోటు రావడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. ఆయన వెంట ఉన్న కుమారుడు ప్రసన్నాంజనేయులు రెడ్డితో పాటు డీఈఓ కార్యాలయ సిబ్బంది హుటాహుటిన సమీపంలోని రమేష్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు తక్షణమే సీపీఆర్ చేసినా ప్రయోజనం లేకపోవడంతో ఆయన మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక రమేష్ ఆస్పత్రికి వచ్చి వెంకటరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించారు. ఆయన కుమారుడిని పరామర్శించి, అంబులెన్స్‌లో ఆయన స్వస్థలమైన పిడుగురాళ్ల మండలం కరాలపాడు గ్రామానికి పంపారు. మరో రెండు నెలల్లో ఉద్యోగ విరమణ పొంది, కుటుంబ సభ్యులతో కలసి శేష జీవితాన్ని ఆనందంగా గడపాల్సిన ఉపాధ్యాయుడు ఈ విధంగా హఠాన్మరణం చెందడంతో తోటి ఉపాధ్యాయులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా పీఎఫ్ క్లియరెన్స్, ఎన్ఓసీ కోసం నరసరావుపేట డీఈఓ కార్యాలయానికి వెళ్లాల్సిన వెంకటరెడ్డి సరైన సమాచారం లేకపోవడంతో గుంటూరు డీఈఓ కార్యాలయానికి వచ్చి ఈ విధంగా మృతి చెందారు.